క్లుప్తంగా

అర్ధరాత్రి పోలీసు గస్తీ



అపరిచిత వ్యక్తులతో ఆరా తీస్తున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, బ్యాంకులు, ఏటీఎంల పరిసరాల్లో శుక్రవారం అర్ధరాత్రి రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి గస్తీ నిర్వహించారు. వరుస దొంగతనాల నేపథ్యంలో గస్తీ ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో తిరుగుతున్న అనుమానితులు, అపరిచితులను తనిఖీ చేసి రాత్రి వేళల్లో బయట తిరిగేందుకు గల కారణాలపై ఆరా తీశారు. అలాగే ఆయా ప్రాంతాల్లో డ్యూటీ పోలీస్‌ల పని తీరును ఆయన పర్యవేక్షించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

రేపు మున్సిపల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలన్నారు.

ఆడపిల్లలను బాగా చదివించాలి



మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ వెంకటేశ్వర్లు

గుంతకల్లు రూరల్: ఆడపిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని మండల న్యాయసేవాధికార సంస్థ రీసోర్స్ పర్సన్లు వెంకటేశ్వర్లు, గోపాలక్రిష్ణ సూచించారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆడపిల్లలు అన్న వివక్ష పూర్తిగా తుడిచి వేయాలన్నారు. ఉన్నతస్థాయికి ఎదిగిన మహిళలను ఆదర్శంగా తీసుకుని పిల్లలను పెంచాలన్నారు. అనంతరం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మంజునాథరెడ్డి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి జన్మదినం (నవంబర్ 29) సందర్భంగా 11వ వార్డు వైఎస్సార్‌సీపీ యువనాయకుడు అబ్దుల్ బాసిద్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామి స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నేత సి.బి.మంజునాథరెడ్డి ప్రారంభించారు. అనంతపురం కిమ్స్ సవీరాకు చెందిన గుండె వైద్యనిపుణులు 195 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునశాస్త్రి, ఎండీఆర్ ఖలీల్, అబ్దుల్‌బాసిద్, హోతూరు శివ, అంజి, ప్రతాప్, మహేష్, జాకీర్, మహబూబ్‌బాషా, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌తోనే ఉపాధ్యాయ సంక్షేమం



ర్యాలీ ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లు: యూటీఎఫ్‌తోనే ఉపాధ్యాయ సంక్షేమం సాధ్యమని యూటీఎఫ్ నాయకులు అన్నారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా పట్టణ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 జనవరి 5, 6, 7, 8 తేదీల్లో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు జీఓ 117ను రద్దు చేసి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు రాఘవేంద్ర, మల్లికార్జున, రామప్పచౌదరి, నాయకులు రాజ్‌కుమార్, విశ్వనాథ్., కల్పన, పావన మురళీ, శంకరయ్య, మల్లికార్జున, ఎల్లన్న, రమేష్, రఫీ, రేవన, సిద్దయ్య, సుధాకర్, వెంకటేష్, ఖలీల్, చిరంజీవి, పెన్నయ్య, విశాలాక్షి, జయదుర్గ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ ఎండుముఖం

- పూత దశలో వర్షాభావం
- ఆవేదనలో అన్నదాతలు

యల్లనూరు: రబీ సీజన్‌లో ఆరుగాలం శ్రమించి కష్టపడి పప్పుశనగ పంటను సాగు చేస్తే.. వర్షాభావం రైతులను వేధిస్తోంది. పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం చెట్లల్లో పులుసు కారిపోతోంది. వర్షాలు సకాలంలో పడటంతో పప్పుశనగ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తే.. కూటమి ప్రభుత్వం కేవలం 25 శాతం సబ్సిడీ ఇచ్చిందని రైతులు వాపోయారు. శింగనమల నియోజకవర్గంలో యల్లనూరు మండలంలో 2,500 ఎకరాలు, పుట్లూరులో 6,242 ఎకరాల్లో పప్పుశనగ పంటసాగు చేశారు. గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల మండలాల్లో పప్పుశనగ సాగు విస్తీర్ణం తక్కువగా ఉంది. పప్పుశనగ పంటకు ఎండుతెగులు సోకడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోయారు. అలాగే పప్పుశనగ పంటకు పూత సరిగా రాకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి సాయం కూడా లేదు..

రైతులకు పెట్టుబడి సాయం కూడా కూటమి ప్రభుత్వం అందించలేదు. రైతులు అప్పులు తెచుకుని పప్పుశనగ పంట సాగు చేశారు. ఎకరాకు విత్తనాలు, ఎరువులు వగైరా రూ.15 వేలు ఖర్చు పెట్టారు. పంట ఎండుముఖం పట్టడంతో చేసిన అప్పులు కూడా తీరుతాయో లేదోనని అన్నదాతలు సతమతమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



యల్లనూరు సమీపంలో ఎండుముఖం పట్టిన పప్పుశనగ

ఎకరాకు రూ.16 వేల ఖర్చు



11 ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశా. వర్షాభావంతో ఎకరాకు ఐదారు బస్తాలు వచ్చే అవకాశం ఉంది. అప్పులు చేసి పంటలను సాగు చేస్తే అన్నదాతకు తీరని అన్యాయం జరుగుతోంది. గతంలో ఎకరాకు 10 బస్తాలు అయ్యేవి. ప్రస్తుతం క్వింటా 6,400 ధర ఉంది.

– శివకామేశ్వరరెడ్డి, రైతు, పాతపల్లి

మూడెకరాల్లో సాగు



పప్పుశనగ పంట మూడెకరాల్లో సాగు చేశా. తెగుళ్ల సోకడంతో పాటు సకాలంలో వర్షాలు లేక పంట దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. పంట సాగు కోసం బ్యాంకుల్లో అప్పులు చేశాం. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– అశోక్‌కుమార్‌రెడ్డి, రైతు, వెన్నపూసపల్లి

అప్రమత్తంగా ఉండాలి



పప్పుశనగ పంటకు ఇప్పటి నుంచి తెగుళ్ల రాకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. తెగుళ్ల సోకితే అన్నదాతలు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. సూచించిన మేరకు మందులు పిచికారీ చేయాలి. పప్పుశనగ పంట ఎకరాకు ఐదారు బస్తాల వరకూ రావచ్చు.

– రామకృష్ణుడు, వ్యవసాయాధికారి

కనకదాస విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి

గుంతకల్లు: పట్టణంలోని బీరప్పగుడి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన భక్త కనకదాస కాంస్య విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని పట్టణ కురబ సంఘం కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం బీరప్ప గుడి ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కురుబ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కె.సోమశేఖర్, కురుబ సాధికర అనంతపురం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ కె.లింగన్న, జెడ్పీటీసీ కె.కదిరప్ప మాట్లాడారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి సవితమ్మ, హిందూపురం, అనంతపురం, కర్నూలు ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, నాగరాజు, మాజీ మంత్రులు ఎం.శంకరనారాయణ, కేవీ ఉషశ్రీ చరణ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, ఆర్.జితేంద్రగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని హాజరవుతారన్నారు. ముందుగా ప్రత్యేక రథంలో భక్త కనకదాస చిత్రపటంతో పట్టణంలోని రైల్వేగ్రౌండ్ నుంచి పాత గుంతకల్లులోని బీరప్ప గుడి సర్కిల్ వరకూ భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం బీరప్ప కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కురుబ ఆత్మీయ సమ్మేళనంలో అతిథులు పాల్గొంటారన్నారు. అదేవిధంగా కురుబ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల కురుబలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. కురుబ సంఘం నియోజకవర్గ కార్యదర్శి భవాని మల్లికార్జున, నాయకులు కె.రామప్ప, రాణాప్రతాప్, లింగన్నగౌడ్, కే.శివప్ప, బసిరెడ్డి, ఈశ్వరప్ప, సాంబ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

‘ముస్లింల మనోభావాలను దెబ్బతీశారు’

గుంతకల్లు: శాసన మండలిలో మంత్రి సత్యకుమార్ ‘వంద ఎలకలు తిని హజ్ వెళ్లారు’ అంటూ మాట్లాడి యావత్ ముస్లింల మనోభావాలు దెబ్బతీశారని నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హాఫిజ్ అబ్దుల్ మాలిక్ సాబ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు టీడీపీకి చెందిన మంత్రి అచ్చెంనాయుడు వత్తాసు పలకడాన్ని తప్పుపట్టారు. వారు మీడియా సమక్షంలో బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ధర్మవరం గేట్ సమీపంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలు చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు నియోజకవర్గ సమస్యలు, రాష్ట్ర సమస్యలపై చర్చించాలి కానీ ముస్లింలకు పవిత్రమైన హజ్ యాత్రికులపై ఈ విధంగా మాట్లాడం ఎంతవరకూ సమంజమని ప్రశ్నించారు. సత్యకుమార్‌పై ఉన్న నమ్మకంతో ధర్మవరంలో ముస్లిం ఓటర్లు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మతాన్ని, కులాన్ని కించేపరిచేలా మాట్లాడితే చూస్తు ఊరుకోమన్నారు. పవిత్రమైన శాసనమండలిలో ఇలాంటి వాఖ్యలు చేసిన సత్యకుమార్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనార్టీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు షర్ఫుద్దీన్, కార్యదర్శి అలీఫీర్, కోశధికారి ఫయాజ్, సహాయ కార్యదర్శి అక్తర్ బాషా, సభ్యులు అబ్దుల్, రఫీక్, అబ్దుల్‌అజీజ్, బందానవాజ్, సలామ్, యాసిన్, సున్నిబాయి. గౌస్‌పీర్, సమీర్, దాదు, దూద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్దుల్‌మాలిక్ తదితరులు

కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

గుంతకల్లు రూరల్/గుత్తి: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీదేవి సూచించారు. శనివారం ఆమె ఐసీడీఎస్ సీడీపీఓ ఢిల్లీశ్వరితో కలిసి గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు, ప్రీస్కూల్ నిర్వహణ, పిల్లలకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యత, రికార్డుల నిర్వహణ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సెంటర్‌కు మంజూరైన టాయిలెట్, డ్రింకింగ్ వాటర్ పనుల నిర్వహణను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ పెంచాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి తదితరులు ఆమె వెంటున్నారు. అలాగే గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని సూచించారు. సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్ వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

యాడికి: ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేకత విధానాలను నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ మాట్లాడారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, విద్యుత్ చార్జీల తగ్గింపు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పథకాల పేర్లు మార్చడం తప్పా కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇంకెప్పుడిస్తారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న అనంతపురం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు రైతులు, రైతు కూలీలు, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి జూటూరు రఫి, నాయకులు ఆదినారాయణ రెడ్డి, ఓబిరెడ్డి, నీలూరు లక్ష్మయ్య, శ్రీరాములు, నారాయణ స్వామి, నరసింహ, రాకేష్, వడ్డే రాముడు,కుళ్లాయి రెడ్డి, రంగస్వామి, శివన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్

రక్తదాన శిబిరానికి స్పందన

గుంతకల్లు: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేవీవీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్, రూరల్ ఎస్ఐ రాఘవేంద్ర తదితరులు హజరయ్యారు. వారు మాట్లాడుతూ అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. ఈ సందర్భంగా 50 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్ స్కూల్ కరస్పాండెంట్ మాథ్యూ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ, నేషనల్ వలంటీర్ సంజీవరాముడు తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ కూల్చివేత యత్నంపై ఆందోళన

పామిడి: పట్టణంలోని భావసార క్షత్రియ కల్యాణ మంటపం కాంప్లెక్స్ కూల్చివేత ప్రయత్నంపై శనివారం భావసార క్షత్రియులు ఆందోళన చేశారు. దేవదాయశాఖ ఏఈ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో సీఐ యుగంధర్ సారథ్యంలో పోలీసులు జేసీబీతో కాంప్లెక్స్ కూల్చివేత యత్నాన్ని వారు అడ్డుకున్నారు. దేవదాయ శాఖకు సంబంధించి స్థలంలో కాంప్లెక్స్ నిర్మించి నెలకు రూ.30 వేల చొప్పున అక్రమంగా బాడుగలు వసూలు చేసుకుంటున్నారంటూ కాంప్లెక్స్ కూల్చివేతకు అధికారులు ప్రయత్నించారు. ఈసందర్భంగా భావసారక్షత్రియ సమాజ్ కమిటీ సభ్యులు జే శ్రీనివాసరావు, అడ్వకేట్ దత్తు, ముకుందా తదితరులు అధికారులతో మాట్లాడారు. 1971లో బేగారి సత్రం శిథిలావస్థలో ఉన్నప్పుడు భావసారక్షత్రియ సమాజ్ సభ్యులు చందాలు పోగుచేసి భావసార క్షత్రియ కల్యాణ మండపం నిర్మించారు. 1974లో ఎండోమెంటు ఆధీనంలోకి వెళ్లిదన్నారు. అప్పటి నుంచి భావసారక్షత్రియ భవన్ అనే కమిటీని ఎల్.ఎస్.నారాయణరావు స్థాపించి హౌస్ ట్యాక్స్‌లు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నాన్నారు. ప్రస్తుతం అధికారులు అక్రమంగా కాంప్లెక్స్ బాడుగలు వసూళ్లు చేసుకుంటూ ఎండోమెంట్‌కు గండి కొడుతున్నామనడం ఎంతవరకూ సమంజసమన్నారు. ఇప్పటికే హైకోర్టులో ఈ కేసు మోషన్‌లో ఉందని, రెండు వారాలు సమయం ఇవ్వాలంటూ భావసార క్షత్రియులు తెలిపారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లడంతో సమస్య సద్దుమణిగింది.



ఆందోళన చేస్తున్న భావసార క్షత్రియులు

జాతీయస్థాయి ఫలితాల్లో గోల్డ్ మెడల్

గుత్తి: ఎన్‌పీటీఈఎల్ (నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్) ఖరగ్ పూర్ యూనివర్శిటీ నిర్వహించిన జాతీయ స్థాయి సర్టిఫికేషన్ కోర్సు పరీక్ష ఫలితాల్లో గేట్స్‌లో థర్డ్ ఇయర్ సైబర్ సెక్యూరిటీ చదువుతున్న లక్ష్మీ చైతన్య గోల్డ్ మెడల్ సాధించింది. ఇంట్రడక్షన్ టు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే కోర్సుకు సంబంధించిన పరీక్షల్లో 94 శాతం మార్కులతో ఆమె ఉత్తీర్ణత సాధించింది. దీంతో పరీక్ష నిర్వాహకులు లక్ష్మీ చైతన్యకు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. ఈ శుభ సందర్భాన్ని పురష్కరించుకుని శనివారం గేట్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో లక్ష్మీ చైతన్యను ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా తదితరులు అభినందించారు.



గోల్డ్ మెడల్ సాధించిన లక్ష్మీ చైతన్యను అభినందిస్తున్న దృశ్యం

ప్రతిభ, నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

గుంతకల్లు: ప్రతిభ, నైపుణ్యంతోనే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీ శంకర నంద గిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి అన్నారు. శనివారం కళాశాలలో ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన 15 రోజుల శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆయనతోపాటు ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దివకర్‌రెడ్డి, కోర్డినేటర్ ప్రదీప్, కళాశాల డైరెక్టర్ గోపాల్ హాజరై మాట్లాడారు. నైపుణ్యత సాధించాలంటే విద్యార్థులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతోగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో శిక్షకులు గౌతమ్, శంకర్, బాలదాసు, ఐసీటీ కళాశాల కోఆర్డినేటర్ కురుపాటి రాకేష్, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, స్వాక్ కోర్డినేటర్ కృష్ణానంద, మెంటర్స్ సువర్ణదేవి, వాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఎన్‌సీసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేసీ హరి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ప్రకాష్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ లాస్య తదితరులు పాల్గొన్నారు.

‘అపార్’ సమస్యలు పరిష్కరించండి

తాడిపత్రి రూరల్: అపార్ నమోదులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని శనివారం మునిసిపల్ అధికారి దాశరథికి సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, రామాంజనేయులు, ఉమాగౌడ్, అబ్రహం, రవికుమార్, రమణ, షెక్షావలి, రామక్రిష్ణ తదితరులు ఉన్నారు.

ఫీజులపై ఉన్న శ్రద్ధ.. చదువుపై చూపండి

తాడిపత్రి రూరల్: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు ఫీజుల వసుళ్లపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువు పట్ల లేదని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రైవేట్ పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అరకొర జీతాలు ఇవ్వడమే కాక ఏడాదిలో పదినెలలు మాత్రమే జీతాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రైవేట్ పాఠశాలలకు ఉత్తీర్ణతలో తీసిపోమని నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

గుత్తి: మండలంలోని తొండపాడులో ఉన్న బొలికొండ రంగనాథస్వామి ఆలయ ఆవరణలో శనివారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మాలధారులకు అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం యాడికి గ్రామానికి చెందిన జీఎస్టీ రవితేజ, వైష్టవి దంపతులు మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బుగ్గ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప, భవాని, ఆంజనేయ స్వామి, శివమాల ధరించిన 300 మంది స్వాములకు అన్నదానం చేశారు.

లారీల నిలిపివేత

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని అనంతపురం రోడ్డు, కడప రోడ్డులో వైఎస్సార్ జిల్లా నుంచి ఇసుక, సిమెంట్, ఫ్లయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీలను శనివారం సాయంత్రం కొందరు టీడీపీసానుభూతిపరులు నిలిపివేశారు. విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది కలసి సంఘటన స్థలానికి వెళ్లారు. లారీలను ఎందుకు నిలిపారని వారిని ప్రశ్నించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన బీజేపీ నాయకుల వ్యవహార శైలిని నిరసిస్తూ లారీలను నిలుపుదల చేశారని సమాచారం. వైఎస్సార్ జిల్లా థర్మల్ ప్లాంట్‌కు సంబంధించి ఫ్లయాష్ వివాదంలో లారీలను నిలుపుదల చేశామని పోలీసులకు తెలిపినట్టు సమాచారం. వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

గార్లదిన్నె: మర్తాడుకు చెందిన ఓయువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అశోక్ (30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.



మృతుడు అశోక్

విద్యుత్ బిల్లులు చెల్లించండి

గుంతకల్లుటౌన్: విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఆదివారం కూడా అన్ని రెవెన్యూ కౌంటర్లు తెరిచి ఉంటాయని ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్ర శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సమీపంలోని రెవెన్యూ కౌంటర్లల్లో విద్యుత్ బిల్లులను చెల్లించాలని ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

తాడిపత్రి రూరల్/పామిడి: తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లి, తేరన్నపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను శనివారం ఈఆర్ఓ శిరీష తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారాల్లో నియోజక వర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు కొత్త ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు ఈఆర్ఓ పలు సూచనలిచ్చారు. ఈఆర్ఓ వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్ తదితరులున్నారు. అలాగే పామిడి మండలంలోని 52 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రెండో విడతగా శనివారం చేపట్టిన ఓటరు నమోదు స్పెషల్ కాంపైయిన్‌లో 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎన్.శ్రీధర మూర్తి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రీ సర్వే పక్కాగా నిర్వహించండి

గుంతకల్లుటౌన్: ఇంటింటి రీ సర్వే పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సూచించారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రీ సర్వే నిర్వహణపై వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రీ సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రీసర్వేకు సంబంధించి ప్రభుత్వం పంపిన ట్యాబ్‌లను ప్లానింగ్ సెక్రటరీలకు అందజేశారు. మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్‌లోని అల్పాహారాన్ని, తాగునీటిని పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన భోజనం, అల్పాహారం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు.

జూదరుల అరెస్టు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆంథోని స్ట్రీట్ కూరగాయల మార్కెట్ వద్ద శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ తెలిపారు. జూదరుల నుంచి రూ.59,350 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలో పేకాట, మట్కా, బెట్టింగ్ తదితర జూదాలు జరుగుతున్నట్లయితే పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ సూచించారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలోని సత్యసాయిబాబా మందిరంలో శనివారం బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం అనంతరం అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12గంటలకు శ్రీసత్యసాయి వ్రతాన్ని భక్తులచే నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం 5గంటలకు సత్యసాయి చిత్రపటాన్ని భక్తులు కోలాటాలు, భజన కీర్తనలు ఆలపిస్తూ పట్టణంలో ఊరేగించారు. రాత్రి 7గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.